**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ: 23.10.2024** **సమయం 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఈనాడు బ్రిక్స్ దేశాలు సంఘటితమై ఉగ్రవాద చర్యలకు, ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం చేసేందుకు నిరాకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు.
2. కేరళ లోని వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక గాంధీ తన నామినేషన్ పత్రాన్ని ఈరోజు దాఖలు చేశారు.
3. భారత తీర రక్షణ దళం ICG దానా తుఫాను ధాటికి ముందు - ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టం జరగకుండా పలు నివారణ చర్యలను అమలు చేసింది.
4. న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో జరిగిన పురుషుల హాకీలో భారత్ తొలి మ్యాచ్‌లో జర్మనీతో 0-2 తేడాతో ఓడిపోయింది.

## PM- BRICS ADDRESS

ఈనాడు బ్రిక్స్ దేశాలు సంఘటితమై ఉగ్రవాద చర్యలకు, ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం చేసేందుకు నిరాకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. కజాన్‌లో రెండు రోజుల పాటు జరిగిన 16వ ప్లీనరి ముగింపు సమావేశంలో మాట్లాడుతూ మోదీ... ఉగ్రవాదం పట్ల ద్వంద్వ వైఖరి తగదని అన్నారు. ఐక్యరాజ్యసమితిలో పెండింగ్‌లో ఉగ్రవాద సమస్య పరిష్కారానికి సమగ్ర వ్యూహంపై బ్రిక్స్ దేశాలు కలిసి పని చేయాలని మోదీ పిలుపునిచ్చారు. సైబర్ భద్రత, సురక్షితమైన కృత్రిమ మేధస్సు కోసం ప్రపంచ నిబంధనల మేరకు కృషి చేయాలని కూడా ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచం ఇప్పుడు - యుద్ధం, సంఘర్షణ, ఆర్థిక అనిశ్చితి, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం వంటి అనేక సవాళ్ల మధ్య ఉన్న తరుణంలో ఈ బ్రిక్స్ సదస్సు

జరుగుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారత్ చర్చలకు, దౌత్యానికి మద్దతు ఇస్తుందని, యుద్ధానికి కాదని అన్నారు. కోవిడ్-19ని సమిష్టిగా ఎదుర్కున్న నేపథ్యంలో సురక్షితమైన, బలమైన, సంపన్నమైన భవిష్యత్తు కోసం బ్రిక్స్ కొత్త అవకాశాలను సృష్టించగలదని అన్నారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం, ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, నీటి రంగాలలో భద్రతను నెలకొల్పడం అన్ని దేశాలకు ప్రాధాన్యతా అంశాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. బ్రిక్స్ - ప్రపంచ మానవాళిలో **40** శాతం, ఆర్థిక వ్యవస్థలో దాదాపు **30** శాతం ప్రాతినిధ్యం వహిస్తుందని, గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ అనేక లక్ష్యాలను సాధించిందని అన్నారు. రానున్న కాలంలో ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ సంస్థ మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.  బ్రిక్స్ దేశాలకు సహకారాన్ని అందించడానికి భారత్ పూర్తిగా కట్టుబడి ఉందని అన్నారు. బ్రిక్స్ దేశాలన్నింటిలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. దేశంలో మల్టీమోడల్ కనెక్టివిటీని వేగంగా పెంచేందుకు భారతదేశం గతిశక్తి పోర్టల్‌ను రూపొందించిందని తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సమగ్రతను పెంపొందించే ప్రయత్నాలను మోదీ స్వాగతించారు.

## FUR REV. KERALA- BYPOLL

కేరళ లోని వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు  కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంక గాంధీ తన నామినేషన్ పత్రాన్ని ఈరోజు దాఖలు చేశారు. ప్రియాంక గాంధి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమి భాగస్వామ్య పార్టీల సీనియర్ నేతలు రోడ్‌షోలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ ప్రియాంక గాంధీతో పాటు ఉన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రియాంక గాంధి వయనాడ్ లో పోటీ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రాహుల్ గాంధీ గత సార్వత్రిక ఎన్నికలలో వయనాడ్, రాయ్ బరేలీ రెండు స్థానాల

నుండి ఎన్నికైన తరువాత, రాయ్ బరేలీ నుండి ప్రాతినిధ్యం వహిస్తుండగా, వయనాడ్ స్థానం ఖాళీ అయింది.

GADKARI-WORLD CONGRESS:

మన దేశంలో 22 లక్షల కోట్ల రూపాయల వార్షిక ఇంధన దిగుమతులను తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇంజినీరింగ్ అసెట్ మేనేజ్‌మెంట్‌పై 18వ ప్రపంచ కాంగ్రెస్‌లో మంత్రి ప్రసంగిస్తూ, భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల నెరవేర్చడంలో సాంకేతికత పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. గడ్కరీ అవసరాల ఆధారిత పరిశోధనను అవసరమని, ఆస్తుల నాణ్యతను నిర్వహించడానికి ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

CHANA DAL:

న్యూఢిల్లీలో భారత జాతీయ సహకార వినియోగదారు సమాఖ్య సంస్థ (NCCF), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (NAFED) వ్యాన్‌ల ద్వారా భారత్ బ్రాండ్ రెండవ విడత శనగ పప్పు విక్రయాన్ని కేంద్రం ఈరోజు ప్రారంభించింది. వ్యాన్‌ల ఫ్లాగ్‌ఆఫ్ కార్యక్రమంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ, కేంద్రీయ భాండార్, మొబైల్ వ్యాన్‌లు, NAFED, ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు, బిగ్ చైన్ రిటైల్ లలో వేరుశనగ పప్పు కిలో 70 రూపాయలకు, శనగలు కిలో 58 రూపాయలకు లభిస్తాయని, పెసర పప్పు కిలో 107 రూపాయలకు, ఎర్ర పప్పు కిలో 89 రూపాయలకు లభ్యమవుతాయని మంత్రి చెప్పారు.

## CYCLONIC 'DANA'

తీవ్రమైన తుఫాను 'దానా' రేపటి అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజామున ఒడిశా తీరంలోని భితార్కానికా, ధమ్రా మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో 'దానా' గాలి వేగం గంటకు 100 నుంచి 120 కిలోమీటర్లుగా ఉంటుంది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈ ఉదయం తీవ్ర వాయుగుండంగా మారిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఒడిశాలోని కేంద్రపారా జిల్లాలోని భితార్కానికా నేషనల్ పార్క్ పై తీవ్ర తుఫాను ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, జాతీయ పార్కులోని జంతువులను, అనేక ఇతర జాతుల వృక్షజాలం, జంతుజాలాన్ని రక్షించడానికి అటవీ అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఎస్‌డిఆర్ఎఫ్ డిఐజి మొహసేన్ షాహిదీ పశ్చిమ బెంగాల్‌లో నాలుగు బృందాలను రిజర్వ్ లో ఉంచినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో కూడా సన్నాహాలు చేసినట్లు ఆయన తెలిపారు.

## ICG-CYCLONE DANA

భారత తీర రక్షణ దళం ICG దానా తుఫాను ధాటికి ముందు - ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టం జరగకుండా పలు నివారణ చర్యలను అమలు చేసింది. ఈ దళం  పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. తుఫాను ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. పశ్చిమ బెంగాల్, ఒడిశాలోని ఓడలు, విమానాలు, రిమోట్ ఆపరేటింగ్ స్టేషన్‌లను సక్రమంగా నిర్వహించడం, మత్స్యకారులకు, నావికులకు వాతావరణ హెచ్చరికలు ఎప్పటికప్పుడు జారీ చేస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తీర రక్షణ దళం నౌకలు, విమానాలను కూడా సమీకరించి, సముద్రంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వేగంగా స్పందించడానికి సిద్ధంగా ఉంచింది. స్థానిక పరిపాలనలు, విపత్తి నిర్వహణ అధికారులతో సమన్వయం, సమర్ధతతో పనిచేస్తుంది.

## HOCKEY

న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో జరిగిన పురుషుల హాకీలో భారత్ తొలి మ్యాచ్‌లో జర్మనీతో **0-2** తేడాతో ఓడిపోయింది. జర్మనీ తరఫున **4**వ నిమిషంలో హెన్రిక్ మెర్ట్‌జెన్స్, **30**వ నిమిషంలో కెప్టెన్ లుకాస్ విండ్‌ఫెడర్ గోల్స్ చేశారు. ఒక దశాబ్దం తర్వాత భారత రాజధానికి అంతర్జాతీయ హాకీ తిరిగి రావడంతో ఈ సిరీస్ ప్రత్యేకమైనది. సిరీస్‌లో రెండో టెస్టు రేపు జరుగుతుంది.

## MANN KI BAAT:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ, విదేశాలలోని ప్రజలతో తన మనసులోని ఆలోచనలను పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం వచ్చే ఆదివారం **27**న ఆకాశవాణిలో ప్రసారమవుతుంది. ప్రతి నెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో ఇది **115**వ ఎపిసోడ్. కాగా, ఈ కార్యక్రమం కోసం ప్రజలు తమ ఆలోచనలు, సూచనలను టోల్ ఫ్రీ నంబర్ **1800-11-7800** ద్వారా పంపించవచ్చు. ప్రజలు తమ సలహాలు, సూచనలను నరేంద్ర మోదీ యాప్ లేదా **MyGov** ఓపెన్ ఫోరమ్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పంచించవచ్చు.